క్లుప్తంగా

బీసీ సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లండి



జేపీ నడ్డాతో రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్

కాచిగూడ: బీసీల సమస్యలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని కోరుతూ.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరామన్నారు. నందగోపాల్, నీరడి భూపేష్‌సాగర్, గోవింద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం అదృష్టం

కాచిగూడ: ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభించడం తన అదృష్టమని ఎల్‌బీ నగర్ జోన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ కోటేశ్వర్‌రావు అన్నారు. కాచిగూడ తుల్జాభవన్‌లో జరుగుతున్న శుక్ల యజుర్వేద పఠనంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిరుధ్‌శర్మ గత 15 రోజులుగా శుక్ల యజుర్వేదంలోని దాదాపు 2500 శ్లోకాలు పఠనం చేస్తున్నారు. కోటేశ్వర్‌రావు దంపతులను నిర్వాహకులు బ్రహ్మశ్రీ నరేంద్రకాప్రె, గిరీష్ కులకర్ణి ఘనంగా సత్కరించి అభినందించారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, సామాజిక కార్యకర్త బీమ్‌సేన్‌మూర్తి, దినకర్ మహరాజ్, వినయ్‌రానడే తదితరులున్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు కార్తీక్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిక్షపతియాదవ్, నేత శ్రీనివాస్, మల్లేష్, వెంకటేశ్వర్‌రావు, సిరిగిరి శ్యామ్, సిరిగిరి కిరణ్, ప్రభాకర్, కల్పన, రేఖ, సాలమ్మ, ఉమా, సత్యనారాయణ, వెంకటేష్, వంశీ తదితరులున్నారు.

బసవేశ్వరుని బోధనలు అనుసరణీయం



మాట్లాడుతున్న లోకయుక్త జస్టిస్ సీ.వీ.రాములు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజ అభ్యుదయం కోసం పాటుపడిన మహనీయులను స్మరించుకోవడం ద్వారా ఆ ప్రాంతం వర్ధిల్లుతుందని తెలంగాణ లోకాయుక్త జస్టిస్ సీ.వీ.రాములు అన్నారు. 800 ఏళ్ల చరిత్ర కలిగిన బసవేశ్వరుడి బోధనలను అనుసరణీయని, వాటిని తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం, ఆర్‌వీఎల్‌బీఎస్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేశారు. జస్టిస్ సీ.వీ.రాములు మాట్లాడుతూ.. పిల్లలకు చిన్ననాటి నుంచే మహనీయుల చరిత్రను తెలపడం ద్వారా మంచి మార్గంలో పయనించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ అధ్యక్షులు ఈశ్వరప్ప, మాజీ ఎంపీ సురేష్ పట్కర్, సంఘం గౌరవ అధ్యక్షుడు సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శి శక్తి శివకుమార్, కోశాధికారి దినేష్‌పాటిల్, గ్రేటర్ అధ్యక్షుడు శివచరణ్, యూత్ అధ్యక్షుడు కె.రాచప్ప, భరత్, మల్లికార్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

మేదరులను ఆదుకోవాలి

నల్లకుంట: వెదురు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న 90 వేల మంది వెదురు కార్మికులను(మేదరి కులస్తులు) ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ మేదరి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేపీ. మురళీకృష్ణ సీఎం కేసీఆర్‌ను కోరారు. ఆదివారం నల్లకుంటలో ఆయన మాట్లాడుతూ.. మేదరులకు గత ఆరేళ్లుగా వెదురు సరఫరా చేయడం లేదన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మేదరులకు వృత్తి నైపుణ్య శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి, మేదరులకు రూ.10 లక్షల ఆర్థికసాయం అందించాలన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. పుట్ట యాదగిరి, వెంకటేష్, పుట్ట లక్ష్మణ్, పాతకోటి మహేష్, శ్రీరాం సత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయాలు పరిష్కార కేంద్రాలు



బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలు ప్రజా సమస్యల పరిష్కార కేంద్రాలుగా మారాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని పార్శిగుట్ట చౌరస్తా సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ నాయకులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. పార్టీ కార్యాలయాల్లో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ప్రజా సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ.. వారికి, పార్టీకి మరింత చేరువ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను ఘనంగా సన్మానించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు సోమన్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, భోలక్‌పూర్, కవాడిగూడ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, వల్లాల శ్యామ్‌యాదవ్, ఉపాధ్యక్షులు బల్లా ప్రశాంత్, పరశురాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు ప్రత్యేక చొరవ

అంబర్‌పేట: ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ సీతా కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వీధుల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుద్ధ్య విభాగం సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే తొలగించారు. నాలాలు, డ్రైనేజీ సమస్యకు ప్లాస్టిక్ వ్యర్థాలే కారణమన్నారు. దీనిపై పారిశుద్ధ్య విభాగం సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాలనీ ప్రతినిధులు కవితారావు, బీఆర్‌ఎస్ నాయకులు గెల్వయ్య, చందు, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సీతా కాలనీలో స్వచ్ఛ హైదరాబాద్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై పలువురి సంతాపం

అంబర్‌పేట్/ముషీరాబాద్ బృందం: ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై పలువురు ప్రముఖులు, ప్రజలు, కళాకారులు, వివిధ పార్టీ నేతలు, తమ సంతాపాన్ని ప్రకటించారు.

- గద్దర్ మృతిపై టీజేఎస్ ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన ప్రతి ఒక్కరిలో రాష్ట్ర అవతరణ అవశ్యకతను చాటి చెప్పారన్నారు.
- ఉద్యమకారుడు, తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రశంకర్ సంతాపం ప్రకటించారు.
- ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం పేదలకు తీరని లోటని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. బాల్యదశ నుంచి తుదిశ్వాస వరకు కష్టజీవుల తరఫున ఆయన కాళ్లకు గజ్జలు కట్టి గొంతెత్తి ఆలపించిన ప్రముఖ ప్రజా గాయకుడు, రచయిత, కవి గద్దర్ అని కొనియాడారు. ఆయన మరణం సామాజిక ప్రజా ఉద్యమాలకు తీరనిలోటన్నారు.
- ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతిపై కాంగ్రెస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చైతన్యవంతమైన పాటలతో ఆయన ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. తెలంగాణ పాటకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన ప్రజా గాయకుడు గద్దర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
- తెలంగాణ మాల మహానాడు నాయకుడు బత్తిని రవి సంతాపం తెలిపారు. ఆయన మరణంతో తెలంగాణ గొప్ప కవి, గాయకుడిని కోల్పోయిందన్నారు.
- ప్రజా గాయకుడు గద్దర్ మృతి తెలంగాణ ప్రజలకు తీరని లోటని, ఆయన అనారోగ్యంతో బాధపడుతూ.. అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం చాలా బాధ కలిగించిందని అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షుడు, వాసవీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ అన్నారు.



గద్దర్‌తో ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు (ఫైల్)

టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం..

- ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గద్దర్ జర్నలిస్టుల పోరాటానికి మద్దతిచ్చారని పేర్కొన్నారు.

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఎయిడెడ్ జేఏసీ సంతాపం..

- ప్రజాయుద్ధనౌక అందరి హృదయాల్లో చిరకాలం వర్ధిల్లే గద్దర్ మృతిపై ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఎయిడెడ్ జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ జగన్మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ లక్ష్మయ్య ఓ ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు.
- ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం ఈ దేశానికి తీరని లోటని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఓ కళాకారుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: రాజ్యాధికార సాధన కోసం కోరుట్లలో నిర్వహించే రాజకీయాలకు అతీతంగా పద్మశాలీ కోరుట్ల రాజకీయ యుద్ధభేరి, పద్మశాలి ఆత్మగౌరవ సభను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామ శ్రీనివాస్ నేత, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు ఏనుగు వినయ్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం ట్యాంక్‌బండ్ జలదృశ్యం వద్ద ఉన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రాజ్యాధికార సాధన కోసం నిర్వహించే 'చలో కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధబేరి' సభను విజయవంతం చేయాలని రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. రామ శ్రీనివాస్, వినయ్ కుమార్, పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంజి శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వల్లకోట్ రాజ్‌కుమార్, కోర్ కమిటీ సభ్యులు బింగి నవీన్‌కుమార్, పద్మశాలీ సంఘం నేత సీత వైద్యం కిషోర్, రఘునందన్‌నేత, సురేష్, సంజీవకుమార్, ఉర్మిళ, గణేష్, ఎయిర్‌టెల్ రాజు, రాపోలు రమేష్, సత్యనారాయణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంఘం నేతలు ఆనంద్, గుండు సుధాకర్, ప్రవీణ్, భాస్కర్, హరి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి గాజుల మహోత్సవం



మహోత్సవంలో మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి

అంబర్‌పేట: కోటి గాజుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఛే నెంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మహోత్సవానికి బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

అభినందన

కాచిగూడ: బెంగుళూర్‌లో జరిగిన 9వ షోటోకాన్ జాతీయ కరాటే పోటీలలో రాష్ట్రం నుంచి కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు 6 మంది పాల్గొని కటా, కుమితి విభాగాల్లో 12 బంగారు పతకాలు గెల్చుకున్నారు. యోగిని బ్లాక్‌బెల్ట్, గణసంతోషిణి బ్లాక్‌బెల్ట్, అనగా, దుర్గా చరణ్, అదిత్య, సహర్ష్ లు పాల్గొని.. 12 గోల్డ్ మెడల్స్‌తో పాటు చాంపియన్‌షిప్ కప్‌ని కైవసం చేసుకున్నారు. వీరిని అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీ.ఎస్.గోపాల్‌రెడ్డి అభినందించారు.

వ్యక్తిపై దాడి.. నిందితుల రిమాండ్

కాచిగూడ: తాగిన మైకంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన నలుగురిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామ లక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ మోతీమార్కెట్ ప్రాంతానికి చెందిన క్రాంతికుమార్ (30) ప్రైవేట్ ఉద్యోగి. కాగా నింబోలిఅడ్డలోని ఇండియన్ పాన్‌షాపు వద్దకు రాగానే అదే సమయంలో నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన బిలాల్‌ఖాన్, బాకర్‌హుస్సేన్, అబిడ్స్ ప్రాంతానికి చెందిన తాపస్, దారుషిఫా ప్రాంతానికి చెందిన అనాశ్‌ఖాన్ మద్యం తాగొచ్చారు. ఇరువురి మధ్య మాటమాట పెరిగి గొడవకు దారితీసింది. ఈ నలుగురు క్రాంతికుమార్ తలపై కొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

ప్రతి కాలనీ, బస్తీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: నియోజవర్గంలోని అన్ని కాలనీలు బస్తీల్లో సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ వార్డు ఆఫీసులో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జైసింహతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కమాండ్ కంట్రోల్ అనే అధునాతన వ్యవస్థను రూపొందించామన్నారు. పోలీసు వ్యవస్థలను పటిష్టం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. స్థానిక డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, బీఆర్‌ఎస్ సీనియర్‌నాయకులు ముఠా నరేష్, రాజ్‌మోహన్, ఆకుల శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకటేష్ ఎస్టీపేమ్, కుమారస్వామి, గడ్డమీది శ్రీనివాస్, రమేష్, సుధాకర్, భాస్కర్, సంతోష్, వంశీ, కిరణ్‌కుమార్, బాబు తదితరులున్నారు.

జాతీయ కవిగా రాయప్రోలు ప్రసిద్ధులు

చిక్కడపల్లి: జాతీయకవిగా రాప్రోలు సుబ్బారావు ప్రసిద్ధులని సీబీఐ పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆదివారం శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా రాప్రోలు సుబ్బారావు సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగమారుతిశర్మ మాట్లాడారు. తెలుగు కవిత్వం గ్రాంథిక భాషగా ఉన్న కాలంలో రాయప్రోలు వ్యవహారిక భాష ప్రాధాన్యంగా కవితోద్యమానికి నాంది పలికారన్నారు. నైజాం నవాబు ఆహ్వానం మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పీఠాధిపతిగా పదవీబాధ్యతలు చేపట్టి ఎందరినో భాషా పండితులను దేశానికి అందించారన్నారు. విశ్రాంత న్యాయమూర్తి కాశీవిశ్వేశ్వర రావు, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, బండి శ్రీనివాస్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న నాగమారుతిశర్మ

డాగ్ బ్రీడర్స్ ఉపాధికి రక్షణ కల్పించాలి

ముషీరాబాద్: కుక్కల పెంపకమే జీవనోపాధిగా జీవిస్తున్న డాగ్ బ్రీడర్స్ ఉపాధికి రక్షణ కల్పించాలని తెలంగాణ డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ముషీరాబాద్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో కుక్కల పెంపకందారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు బెంజిమెన్, సూరజ్‌నాయుడు, రమేష్, వెంకటేష్, సిద్ధిక్, నవీన్‌కుమార్‌లు మాట్లాడుతూ.. కుక్కల కొనుగోలుపై కొంతమంది కేసీఐ సర్టిఫికెట్, సరైన శిక్షణ, వ్యాక్సిన్‌లు లేకుండానే విక్రయిస్తూ.. జంతు ప్రేమికులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. నగరంలో వందలాది మంది డాగ్ బ్రీడర్స్ ఉపాధి పొందుతున్నారన్నారు. తమ ఉపాధిని దెబ్బతీసేలా బెంగళూరు, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి కుక్కలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారన్నారు. సరైన సంరక్షణ లేకుండానే తల్లి నుంచి కుక్కను 10–20 రోజుల్లోపే వేరుచేసి విక్రయించడం వల్ల అవి కొద్ది రోజులకే మృత్యువాత పడుతున్నాయన్నారు. అక్రమ వ్యాపారదారులపై పోలీసులు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

శంకర్ మాకినేనికి 'సినారె–ఇట్‌క్లా' అవార్డు

కాచిగూడ: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి 92వ జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం (ఇట్‌క్లా) ఆధ్వర్యంలో గ్రేటర్ రిచ్మండ్స్ తెలుగు అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు శంకర్ మాకినేనికి అమెరికాలో ఇట్‌క్లా – సినారె, 2023 సంవత్సరానికి ఎన్‌ఆర్‌ఐ సాంస్కృతిక అవార్డును అందజేశారు. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు, సంస్కృతి రత్న డాక్టర్ కె.ధర్మారావు ఓ ప్రకటనలో తెలిపారు. కళ్యాణ్, కల్పన నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో రిచ్మండ్స్, తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అశోక్, మహేష్, గిరి చింతల, మురళీ చిరుతన, తరుణ్ జూలూరి తదితరులు పాల్గొని అభినందించారు.



అవార్డును ప్రదానం చేస్తున్న డాక్టర్ కె.ధర్మారావు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్

నల్లకుంట: వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్ తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆడిటోరియం ఆవరణలో టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ అధ్యక్షతన యూనియన్ సమావేశం జరిగింది. దీనికి హాజరైన రాబర్ట్ బ్రూస్ మాట్లాడుతూ.. కాంట్రీ బ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రెండో పీఆర్సీ కమిటీ నివేదిక ప్రకారం 20 శాతం మధ్యంతర భృతి, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టీఎంహెచ్‌ఈయూ ఫీవర్ ఆసుపత్రి శాఖ అధ్యక్షురాలు కె.లావణ్య, కార్యదర్శి రాజ్‌కుమార్, పద్మజ, ఫారూఖ్ యూనియన్, నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ స్కూల్ ప్రారంభం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం బర్కత్‌పుర సమితి ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ భాగస్వామ్యంతో ఉచిత డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించారు. ఆదివారం డ్రైవింగ్‌స్కూల్‌ను ప్రారంభించిన కేశవ స్మృతి సంవర్ధన సమితి అధ్యక్షుడు పి.కృష్ణారెడ్డి, బీజేవైఎం మాజీ రాష్ట్ర అధ్యక్షులు గుండగోనీ భరత్‌గౌడ్‌లు మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా పేద విద్యార్థులకు ఉపాధి అవకాశం కల్పించేందుకు సమితి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగ యువతి, యువకులకు డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణను ఇస్తామన్నారు. తొలి బ్యాచ్‌ను 18 మందితో ప్రారంభించామన్నారు. కె.ఉపేందర్, సమితి నాయకులు జనార్దన్, ఉపాధ్యక్షులు రామచందర్, సిద్ధి రాఘవేంద్ర, సునీల్‌కులకర్ణి, ఉదయ్, శ్రీనివాస్, సమితి ప్రధాన కార్యదర్శి కె.బాలయ్య తదితరులున్నారు.



ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి, గుండగొనీ భరత్‌గౌడ్

నూతన కమిటీ నియామకం



నూతన కమిటీని అభినందిస్తున్న మాజీ కార్పొరేటర్ రవీందర్, బీజేపీ నేత వెంకటేష్

ముషీరాబాద్: దోమలగూడ తాళ్లబస్తీ నూతన కమిటీ అధ్యక్షుడిగా సీ.హెచ్.శ్రీనివాస్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా బి.శివరాజ్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం దోమలగూడ తాళ్లబస్తీ కమిటీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టి.రవీందర్, జి.వెంకటేష్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. బస్తీ ఉపాధ్యక్షులుగా ప్రేమ్‌కుమార్, కృష్ణ, పి.పాండు, కుమార్, వై.శ్రీనివాస్, కార్యదర్శులుగా గంగాధర్, ఎస్.రవీందర్, కుమార్, రఫీక్, కోశాధికారిగా చంద్రశేఖర్‌గౌడ్, యూత్ అధ్యక్షుడిగా మోహన్‌సాయి, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, కార్యవర్గ సభ్యులుగా కాళిదాసు, బాలు, కన్నయ్య, అరవింద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు ఎ.ప్రభాకర్‌గంగపుత్ర, డి.శ్రీనివాస్‌ముదిరాజ్, సీహెచ్ రాజశేఖర్‌ముదిరాజ్, పాస్‌పోర్ట్ శ్రీనివాస్, రాము, వెంకటేష్, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

చిత్రాల్‌నగర్‌లో శ్రావణ మాసం బోనాలు

ముషీరాబాద్: శ్రావణమాసం బోనాల పండుగ కవాడిగూడ డివిజన్ చిత్రాలనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే బస్తీలోని నల్లపోచమ్మ దేవాలయంలో మహిళలు పెద్దఎత్తున హాజరై బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. నల్లపోచమ్మ దేవాలయంలో జరిగిన బోనాల ఉత్సవాలు, ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్తీ కమిటీ నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. చిత్రాల్‌నగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు ఎస్.విశ్వనాథ్, టింకు, వడ్లూరి మల్లేష్, శ్రావణ్, ప్రసాద్, మురళీ, బీఆర్‌ఎస్ నాయకులు అమరం వినోద్, జంగా శ్రీనివాస్, డి. శ్రీనివాస్, నర్సింగ్, శివ, గిరిబాబు తదితరులున్నారు.



దేశ ప్రజల వారసత్వానికి ప్రతీక చేనేత రంగం



చేనేత రంగంలో కృషి చేస్తున్న వారిని సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: దేశప్రజల వారసత్వానికి ప్రతీక చేనేత రంగమని అఖిల భారత యునైటెడ్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మేడం బాబురావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో భాగంగా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలో చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత రంగంలో కృషి చేస్తున్న పలువురిని సన్మానించారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ 2015 ఆగస్టు 7న చెన్నైలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా భారత చేనేత లోగోను ఆవిష్కరించారని ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా పరిగణిస్తున్నట్లు ప్రకటించారన్నారు. దేశంలో ముఖ్యమైన జీవనోపాధి చేనేతరంగమన్నారు. అనుబంధ కార్మికుల్లో 70 శాతానికి పైగా మహిళలు ఉన్నందున ఈ రంగం మహిళా సాధికారతకు కీలకమన్నారు. రమ శ్రీనివాస్, బూర మల్లేశం, వనం సుమన్, జై శ్రీరాములు, శంకర్, బోనం ఊర్మిళ, సుదీప్, అశోక్, కల్యాణ్, దశరథ్ తదితరులున్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



ముషీరాబాద్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు, అండమాన్ నికోబార్ దీవుల ఇన్‌చార్జి పూస రాజు విమర్శించారు. అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ కార్యాలయంలో నేరుగా సుమారు మూడు లక్షల మంది పేదలు దరఖాస్తు చేసుకున్న వాటిపై ఎలాంటి సర్వే చేపట్టడం లేదని విమర్శించారు. నియోజకవర్గంలో కేవలం 250 డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఎద్దేవ చేశారు. బీజేపీ నాయకులు మద్దూరు శివాజీ, డివిజన్ అధ్యక్షులు అరుణ్‌కుమార్, రవికుమార్, నరేష్‌కుమార్, మహేందర్‌బాబు తదితరులున్నారు.

బీజేపీ ధర్నాను విజయవంతం చేయాలి..

అంబర్‌పేట: డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కోసం నేడు బీజేపీ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు కోరారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్‌లో ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని సూచించారు. బీజేపీ నాయకులు భూషణ్‌చారి, యశ్వంత్, కృష్ణముదిరాజ్ తదితరులున్నారు.